అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 344 | వరంగల్ | బుధవారం, 28 అక్టోబర్ 2026 | పేజీలు: 06

విద్యుత్ సేవల్లోనూ సాంకేతిక వినియోగం

పంపిణీ వ్యవస్థలో మనకు జాతీయ స్థాయి గుర్తింపు

- పంపిణీ వ్యవస్థలో మనకు జాతీయ స్థాయి గుర్తింపు
- విపత్తులను ఎదుర్కోవడం విద్యుత్ శాఖకు కొత్తేమీ కాదు
- ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు
- లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల సామర్థ్యం పెంపు
- రైతులకు అదనపు విద్యుత్
- ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడికి ప్రత్యేక ఏర్పాట్లు
- మూడవ డిస్కంతో సబ్సిడి సేవలు

SPECIAL PAGE

అన్ని రంగాల మాదిరిగా విద్యుత్ సేవల్లోనూ ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్, ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మెరుగైన సేవలు అందిస్తున్నామని, ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ సిబ్బంది విద్యుత్ సేవల కోసం క్షేత్ర స్థాయిలో నిరంతర శ్రమిస్తున్నారు అని అన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఎల్ నినో వల్ల భూగర్భ జలాలు తగ్గినప్పటికీ, పంటల మార్పిడి విధానం అమలు చేసి భారం పడకుండా ప్రభుత్వం అనేక ప్రణాళికలు రచిస్తున్నదని అన్నారు. విద్యుత్ డిమాండు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్ సరఫరాలోని సవాళ్లు' అనే అంశంపై డిజిటల్ మీడియా యూనియన్ ప్రతినిధులతో (టీడీఎంయూ) ప చిట్‌చాట్‌లో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అనేక విషయాలు వెల్లడించారు.

- అక్షరశక్తి,ప్రధాన ప్రతినిధి



వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ఎన్ఐటీ సాంకేతిక సహకారం

- జీడబ్ల్యూఎంసీ-ఎన్ఐటీ వరంగల్ మధ్య కీలక ఒప్పందం..
- పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ఆధునిక పట్టణ సేవలకు ప్రాధాన్యం



4



బదిలీ ఉత్తర్వులు నామమాత్రమేనా?

- ఐదేళ్లు దాటినా పాత స్టేషన్లలోనే విధులు
- అటాచ్‌మెంట్లపై ఆరోపణలు
- వరంగల్ సీపీ పరిధిలో పోస్టింగులపై సమీక్షకు డిమాండ్

2

పోలీసు శాఖలో బదిలీ ఉత్తర్వుల అమలుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐదేళ్లకు పైగా ఒకే పోలీస్‌స్టేషన్‌లో రైటర్లు, కోర్టు కానిస్టేబుళ్లు, ఇతర కీలక విధుల్లో కొనసాగుతున్న కొందరు సిబ్బందిని బదిలీ చేసినప్పటికీ, డీఓలు, అటాచ్‌మెంట్ల ద్వారా తిరిగి పాత స్టేషన్లలోనే విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లా అండ్ ఆర్డర్‌తో పాటు ట్రాఫిక్ విభాగంలోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- ఆరోగ్యకరమైన, మత్తు రహిత దేశాన్ని నిర్మిద్దాం
- హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి
- మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ



మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయి అన్నారు. యువత, విద్యార్థులు, ప్రజల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. *- అక్షరశక్తి, హన్మకొండ*

4



అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి

- అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ములుగు జిల్లా అధికారులకు మంత్రి సీతక్క కీలక ఆదేశాలు

అక్షరశక్తి, ములుగు: అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ములుగు జిల్లా అధికారులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క గారు అప్రమత్తం చేశారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సూచనలు అందిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈదురుగాలుల సమయంలో ప్రజలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు.

సైన్స్ పీహెచ్‌డీ దరఖాస్తు గడువు పొడిగింపు

అక్టోబర్ 31 వరకు అవకాశం

అక్షరశక్తి, వరంగల్: కాకతీయ విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ పరిధిలో 2026 జూలై సెషన్ పీహెచ్‌డీ ప్రవేశాల దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ బి. వెంకట్రాంరెడ్డి తెలిపారు. గతంలో దరఖాస్తుల స్వీకరణకు అక్టోబర్ 24 చివరి తేదీగా నిర్ణయించగా, అభ్యర్థుల సౌకర్యార్థం గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 3న జారీ చేసిన నోటిఫికేషన్ నంబర్ 141/DFS/KU/WGL/2026లోని ఇతర నిబంధనలన్నీ యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీసీ ఆజాదీ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా జయంత్



అక్షరశక్తి, హనుమకొండ: బీసీ ఆజాదీ స్టూడెంట్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా చిన్నూరి జయంత్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంజాల రేవంత్ నియామకాన్ని ప్రకటించారు. బీసీ విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యారంగంలో సమాన అవకాశాల సాధన, విద్యార్థుల సమస్యల పరిష్కారం, వారి అభ్యున్నతి కోసం జయంత్ కృషి చేయాలని పంజాల రేవంత్ ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు పంజాల రేవంత్‌కు చిన్నూరి జయంత్ కృతజ్ఞతలు తెలిపారు. బీసీ విద్యార్థుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతానని, విద్యార్థుల సమస్యలపై వారి గొంతుకగా నిలుస్తానని పేర్కొన్నారు. సంఘం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ హనుమకొండ జిల్లాలో ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.

బదిలీ ఉత్తర్వులు నామమాత్రమేనా?

- ఐదేళ్లు దాటినా పాత స్టేషన్లలోనే విధులు *అటాచ్‌మెంట్లపై ఆరోపణలు
- వరంగల్ సీపీ పరిధిలో పోస్టింగులపై సమీక్షకు డిమాండ్



అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్: పోలీసు శాఖలో బదిలీ ఉత్తర్వుల అమలుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐదేళ్లకు పైగా ఒకే పోలీస్‌స్టేషన్‌లో రైటర్లు, కోర్టు కానిస్టేబుళ్లు, ఇతర కీలక విధుల్లో కొనసాగుతున్న కొందరు సిబ్బందిని బదిలీ చేసినప్పటికీ, డీఓలు, అటాచ్‌మెంట్ల ద్వారా తిరిగి పాత స్టేషన్లలోనే విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లా అండ్ ఆర్డర్‌తో పాటు ట్రాఫిక్ విభాగంలోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జనగామ జోన్ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, జనగామ, రఘునాథపల్లి, నర్మెట పోలీస్‌స్టేషన్లలో కొందరు సిబ్బంది పోస్టింగులపై ఆరోపణలు ఉన్నాయి. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కోర్టు కానిస్టేబుళ్లను ఇతర స్టేషన్లకు బదిలీ చేసినప్పటికీ, అటాచ్‌మెంట్లపై తిరిగి పాత స్థానాల్లోనే కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ట్రాఫిక్ విభాగాల్లోనూ ఇదే తరహా ఆరోపణలు వస్తున్నాయి. బదిలీ అయిన కొందరు సిబ్బంది తిరిగి పాత స్టేషన్లలో రైటర్లుగా కొనసాగుతున్నారని, విధుల కేటాయింపుల్లోనూ అసమానతలు ఉన్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సమగ్ర సమీక్షకు డిమాండ్...

బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత వాటి అమలు ఎలా జరుగుతోంది? అటాచ్‌మెంట్లకు ఎవరు అనుమతులు ఇచ్చారు? వాటి వెనుక పరిపాలనా అవసరాలున్నాయా? అనే అంశాలపై అధికారిక రికార్డుల ఆధారంగా విచారణ జరపాలని డిమాండ్ వినిపిస్తోంది. స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ నివేదికల్లోనూ వాస్తవ పరిస్థితులు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తున్నాయా అనే అంశాన్ని పరిశీలించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదేళ్లకు పైగా ఒకే స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, బదిలీలు, డీఓలు, అటాచ్‌మెంట్ ఉత్తర్వులపై సమగ్ర సమీక్ష చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, పరిపాలనా అవసరాల మేరకు జరిగిన నియామకాలైతే వాటిని స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

డాక్టర్ రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

- 60కిపైగా కుల, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం



అక్షరశక్తి, హనుమకొండ : డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని 60కిపైగా కుల, ప్రజా సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి గౌడ్, ఉద్యమకారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్ రజక, ఉమ్మడి జిల్లా క్రైస్తవ సంఘం ప్రతినిధులు పాస్టర్ ఐసాక్, పాస్టర్ జోసెఫ్, బీసీ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్, సీజేపీ జెన్జి ప్రజ్వల్, న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పటేల్, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ మాదిగ, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్, బావని రెడ్డి, టీడీపీ నాయకుడు నరేష్, కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ దాస్, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకుడు భిక్షపతి, మాస్టిన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగ నర్సయ్య, ఆర్ఎస్పీ పార్టీ నాయకుడు శివాజీ, సంధ్యారెడ్డి తదితరులు మాట్లాడారు. డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఎన్నో ఏళ్లుగా వైద్య సేవలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పేదలు, బడుగు బలహీన వర్గాలకు సేవలందిస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజారోగ్యం, సామాజిక సేవ, పేదల సంక్షేమం, సహకార ఉద్యమం తదితర రంగాల్లో ఆయన చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) ప్రకారం సామాజిక సేవా రంగంలో ఆయనకు ఉన్న అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ రామకృష్ణ కుటుంబం గతంలోనుంచి, ఆయన విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అంశాన్ని ముఖ్యమంత్రి సానుకూలంగా పరిశీలించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ అధ్యక్షుడు కొమ్ముల బాబు, మైనారిటీ ప్రతినిధి ఎం.డి. అలీ, ఉద్యోగుల సంఘం నాయకుడు ఎం.ఆర్.ఓ. సమ్మయ్య, ఫిజియోథెరపీ సంఘం ప్రతినిధి డాక్టర్ రాము, మాదిగ సంఘం నాయకుడు స్వామి, నిరుపేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్, మున్సిపాలిటీ ప్రతినిధి శ్రవణ్, మాదిగ ఉద్యోగుల సంఘం నాయకుడు రవీందర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. డాక్టర్ రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో మద్దతు కొనసాగిస్తామని యాదగిరి గౌడ్, చాపర్తి కుమార్, కేడల ప్రసాద్, సునీల్ మాదిగ, మాదాసి సురేష్, కొమ్ముల బాబు తెలిపారు. సమావేశం అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలందరికీ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల, ప్రజా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, నిరుద్యోగ యువత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్ నిలయం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా..

- ఢిల్లీ నిరసనలకు ప్రత్యేక రైళ్లు కావాలని డిమాండ్
- పొన్నం, ఎంపీ రఘురాం రెడ్డికి స్వల్ప అస్వస్థత
- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



అక్షరశక్తి, హైదరాబాద్ : సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం వద్ద కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మెరుపు ధర్నాతో ఉద్రిక్తత నెలకొంది. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అయితే ప్రత్యేక రైళ్ల కేటాయింపునకు దక్షిణ మధ్య రైల్వే నిరాకరించడంతో రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ నిరసనలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు.

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ రైల్వే అధికారులను కోరింది. అయితే దక్షిణ మధ్య రైల్వే నుంచి అనుమతి లభించకపోవడంతో కాంగ్రెస్ నేతలు నిరసన చేపట్టారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కాంగ్రెస్ నాయకులు రైల్ నిలయానికి చేరుకున్నారు. రైల్వే జీఎంను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో నేతలు రైల్ నిలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైళ్ల కేటాయింపును అడ్డుకుంటున్నారంటూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి





- కేయూలో ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లకు బోయినపల్లి వినోద్‌కుమార్, దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపు



అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబర్ 28: కాకతీయ విశ్వవిద్యాలయ ఉద్యోగులు, పట్టభద్రులు రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం కేయూ క్యాంపస్‌లో పర్యటించిన వారు ఉద్యోగులు, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులకు ఓటరు నమోదు ప్రాధాన్యాన్ని వివరించారు. కేయూ పరిధిలోని వివిధ విభాగాలు, లైబ్రరీ, పరీక్షల నిర్వహణ విభాగాలను సందర్శిస్తూ పట్టభద్రులను కలిసి అవగాహన కల్పించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ చింతకాయల దినేష్‌కుమార్, టీపీసీసీ మాజీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డితో కలిసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు సామాజిక బాధ్యతగా భావించాలని, విశ్వవిద్యాలయ ఉద్యోగులు ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. కేయూ ఉపకులపతి, రిజిస్ట్రార్‌లను కలిసి ఓటరు నమోదు ప్రాధాన్యాన్ని వివరించారు. విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న పరిశోధన ప్రాజెక్టులు, బోధనా విధానంపై వారితో చర్చించారు. కేయూతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.

దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రశ్నించే తత్వానికి, పోరాట పటిమకు కాకతీయ విశ్వవిద్యాలయం నిలయమన్నారు. ప్రశ్నించే హక్కును సమర్థంగా వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావాల్సిన బాధ్యతను ప్రతి పట్టభద్రుడు గుర్తించాలని కోరారు. ఎమ్మెల్సీగా మేధావులు, విద్యావంతులను ఎన్నుకుని శాసనమండలికి పంపే బాధ్యత పట్టభద్రులదేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫారం18 అందజేస్తూ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, ఇన్‌చార్జి డాక్టర్ జెట్టి రాజేందర్, విద్యార్థి నాయకులు కత్తరపల్లి దామోదర్, కలకోటి సుమన్, లంక రాజగోపాల్, పిల్లల నాగరాజు, సంగాని సూర్యకిరణ్, కందికొండ తిరుపతి, పిన్నింటి విజయ్‌కుమార్, కొనుకటి ప్రశాంత్, పస్తం అనిల్, ఎండీ ఇస్మాయిల్, వీరస్వామి పాల్గొన్నారు. సీనియర్ నాయకులు డాక్టర్ బండి రజినీకుమార్, డాక్టర్ బొల్లి కొండ వీరేందర్, జోరిక రమేష్, పొలపల్లి రామ్మూర్తి, సల్లతీగల శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు.

ప్రజల జీవితాల్లో మార్పే ఏఐ లక్ష్యం

- ప్రభుత్వ సేవల్లో సాంకేతికతను సమర్థంగా వినియోగించాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



అక్షరశక్తి, హైదరాబాద్, అక్టోబర్ 28: కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగాన్ని పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. బుధవారం నిర్వహించిన 'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. రైతులు, పింఛనుదారులు తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి మారాలని పేర్కొన్నారు. కార్యాలయాల్లో సాంకేతికత వల్ల ఆదా అయ్యే సమయాన్ని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కేటాయించాలని ఆదేశించారు.ప్రజాధనం వినియోగం, ప్రాజెక్టుల వ్యయాల విశ్లేషణ, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అనే అంశాలను గుర్తించడంలో ఏఐ ఉపయోగపడుతుందని వివరించారు. విద్యుత్ డిమాండ్‌ను ముందుగా అంచనా వేయడం, పరికరాల్లో లోపాలను గుర్తించడం వంటి పనుల్లోనూ ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, నివేదికల తయారీలో సమయాన్ని ఆదా చేసేందుకు ఏఐ దోహదపడుతుందని పేర్కొన్నారు. అయితే ఏఐ అందించే సమాచారాన్ని అధికారులు తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. ప్రజల వ్యక్తిగత సమాచార భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఏఐ ఆధారిత నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. సాంకేతికత వినియోగంలో తప్పులు జరిగితే బాధ్యత వహించే వ్యక్తి ఎవరో స్పష్టంగా ఉండాలన్నారు. తొలుత చిన్నస్థాయిలో ప్రయోగాలు నిర్వహించి, వాటి ఫలితాలను పరిశీలించిన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తరించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందినప్పుడే ఏఐ వినియోగం విజయవంతమైనట్లు భావించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ప్రొఫెసర్ నరసింహారెడ్డికి భేషజీ శిక్షా రత్న-2026

- అభినందించిన కాకతీయ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్



అక్షరశక్తి, వరంగల్: కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ వై.నరసింహారెడ్డికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ప్రతిష్ఠాత్మక 'భేషజీ శిక్షా రత్న-2026' పురస్కారాన్ని ప్రదానం చేసింది. అక్టోబర్ 26న న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పీసీఐ చైర్మన్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం ఆయనను అభినందించారు. ఫార్మసీ విద్య, పరిశోధన రంగాల్లో ఆయన అందిస్తున్న సేవలకు ఈ పురస్కారం గుర్తింపు అని, విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు.

దాదాపు 30 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం కలిగిన ప్రొఫెసర్ నరసింహారెడ్డి ఇప్పటివరకు 180 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. 40 మంది పీహెచ్‌డీ పరిశోధకులకు మార్గదర్శకత్వం వహించారు. నాలుగు పుస్తకాలు రచించడంతోపాటు నాలుగు పేటెంట్లు పొందారు. డీన్‌గా, యూనివర్సిటీ కళాశాల అధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. విశ్వవిద్యాలయ విద్యా, పరిశోధన రంగాల అభివృద్ధికి విశేష సేవలందించారు. ఈ పురస్కారంతో కాకతీయ విశ్వవిద్యాలయానికి మరింత గుర్తింపు లభించిందని వీసీ, రిజిస్ట్రార్ హర్షం వ్యక్తం చేశారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ప్రొఫెసర్ వై. నరసింహారెడ్డిని అభినందించారు.

ఉస్మానియా ఆస్పత్రి పనుల్లో జాప్యం వద్దు

నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



అక్షరశక్తి, హైదరాబాద్: గోషామహల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఉస్మానియా జనరల్ ఆస్పత్రి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. నిర్దిత గడువులోగా పనులు పూర్తి చేయాలని, షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన పనుల్లో జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. బుధవారం నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి ఆస్పత్రి నమూనా డిజైన్లను పరిశీలించారు. వివిధ బ్లాకుల నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత షెడ్యూల్‌తో పోలిస్తే కొన్ని పనులు వెనుకబడి ఉన్నట్లు గుర్తించి, వాటిని వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ప్రతినెలా అధికారులతో కలిసి సమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు సుమారు రూ.2,700 కోట్ల వ్యయంతో, 2,000 పడకల సామర్థ్యంతో, దాదాపు 31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆధునిక ప్రమాణాలతో నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఆస్పత్రిలో వైద్య సదుపాయాలతోపాటు విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరు హాస్టళ్లు, ధర్మశాల, పరిపాలనా భవనం, పచ్చదనం, ఆధునిక వెంటిలేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పునాది పనులు పూర్తికాగా, రెండు అంతస్తుల స్లాబుల నిర్మాణం పూర్తయిందన్నారు. స్థల సేకరణ, రహదారి అనుసంధానం, పక్కనే ఉన్న హాస్టల్ వారసత్వ అంశాలకు సంబంధించిన న్యాయపరమైన సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ), వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పర్యటనలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసేన్, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, మెట్టు సాయికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాటం ఆగదు!

- ప్రజాక్షేత్రమైనా.. న్యాయస్థానమైనా వెనక్కి తగ్గేది లేదు
- బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి



అక్షరశక్తి, హైదరాబాద్/వరంగల్: ప్రజల పక్షాన నిలబడి పోరాడే క్రమంలో ఎలాంటి చట్టపరమైన సవాళ్లు ఎదురైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి స్పష్టం చేశారు.ప్రజాక్షేత్రంలోనైనా, న్యాయస్థానంలోనైనా తమ ప్రయాణం ప్రజల సంక్షేమం కోసమే కొనసాగుతుందని పేర్కొన్నారు. 2023 శాసనసభ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి నమోదైన రాజకీయ కేసు విచారణ నిమిత్తం బుధవారం హైదరాబాద్ నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ చట్టాలను గౌరవిస్తూ, న్యాయస్థానాలపై పూర్తి విశ్వాసంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. చివరికి న్యాయమే గెలుస్తుందన్న నమ్మకం ఉందన్నారు. రాజకీయ సమీకరణాలు, కేసులు తమను ప్రజా సేవకు దూరం చేయలేవని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని వెల్లడించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో భేటీ

మరో కేసు విచారణ నిమిత్తం నాంపల్లి కోర్టుకు వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను రావు పద్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ, నియోజకవర్గ సమస్యలపై చర్చించారు.



తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- ట్రీటెడ్ వాటర్ వినియోగంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



అక్షరశక్తి, హైదరాబాద్, అక్టోబర్ 28: రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు), శుద్ధి చేసిన నీటి వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని, వాటి పని తీరును హైడ్రా పర్యవేక్షించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని (ట్రీటెడ్ వాటర్) ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ల్యాండ్‌స్కేపింగ్, రోడ్ల శుభ్రతకు వినియోగించాలని పేర్కొన్నారు. సచివాలయం, సీఎం కార్యాలయ పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ పార్కుల్లోనూ ఈ నీటినే ఉపయోగించాలని ఆదేశించారు. రైల్వే శాఖ, మెట్రో రైలు వ్యవస్థలను కూడా ట్రీటెడ్ వాటర్ వినియోగ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వందశాతం వినియోగించేలా నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. ట్రీటెడ్ వాటర్ ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు ప్రజలకు సమాచారం అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతుల సమయంలోనే ట్రీటెడ్ వాటర్ వినియోగ నిబంధనలను తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. ప్రైవేటు ఎస్‌టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, శుద్ధి కేంద్రాలను సౌర విద్యుత్‌తో నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. డేటా సెంటర్లకు కూడా శుద్ధి చేసిన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ వరకు నిర్దేశించిన ఆదేశాలు అమలయ్యేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించాలని, తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంఓ కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీవీఎన్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి పాల్గొన్నారు.





మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- ఆరోగ్యకరమైన, మత్తు రహిత దేశాన్ని నిర్మిద్దాం
- హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి
- మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ



అక్షరశక్తి, హన్మకొండ : మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి అన్నారు. యువత, విద్యార్థులు, ప్రజల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణ నుంచి హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి జెండా ఊపి ప్రారంభించి, స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. మాదకద్రవ్యాల లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత తమ శక్తి, ప్రతిభను విద్య, క్రీడలు, సామాజిక సేవ, దేశ నిర్మాణం వంటి సానుకూల కార్యక్రమాల వైపు మళ్లించాలని సూచించారు. ర్యాలీలో పాల్గొన్న రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు "మాదకద్రవ్యాలకు నో చెప్పండి - ఆరోగ్యకరమైన జీవితానికి అవును చెప్పండి", "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి - దేశాభివృద్ధిలో భాగస్వాములు కండి" వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు.

మాదకద్రవ్యాల అలవాటు వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డాక్టర్ సి.హెచ్. సంధ్యారాణి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, డాక్టర్ గొట్టిముక్కల శ్రీలక్ష్మి, పొన్నాల సంయుక్త, రెడ్‌క్రాస్ సిబ్బంది, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ఎన్ఐటీ సాంకేతిక సహకారం

- జీడబ్ల్యూఎంసీ-ఎన్ఐటీ వరంగల్ మధ్య కీలక ఒప్పందం..
- పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ఆధునిక పట్టణ సేవలకు ప్రాధాన్యం





అక్షరశక్తి, వరంగల్: వరంగల్ నగరాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, మెరుగైన మౌలిక సదుపాయాలతో, సుస్థిర పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ సమక్షంలో బుధవారం ఎన్ఐటీ వరంగల్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి కలిసి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఎన్ఐటీ వరంగల్‌లోని విద్యా, పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలను నగర అభివృద్ధి కార్యక్రమాలకు అనుసంధానం చేయనున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, స్మార్ట్ పట్టణ ప్రణాళిక, పర్యావరణహిత అభివృద్ధి వంటి రంగాల్లో సాంకేతిక సలహాలు, వినూత్న పరిష్కారాలను అన్వేషించనున్నారు. జీడబ్ల్యూఎంసీ ఇంజినీర్లు, వివిధ విభాగాల అధికారులకు ప్రత్యేక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు అర్హులైన ఉద్యోగులకు ఉన్నత విద్యావకాశాలను పరిశీలించనున్నారు. జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, నగరాభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, నిపుణుల సూచనలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రముఖ విద్యాసంస్థల పరిజ్ఞానాన్ని పట్టణ పరిపాలనతో అనుసంధానం చేయడం ద్వారా నగర సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనవచ్చన్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ, విద్యాసంస్థలు, పట్టణ స్థానిక సంస్థల మధ్య సమన్వయం బలోపేతం కావడం ద్వారా నగర అభివృద్ధికి అవసరమైన వినూత్న పరిష్కారాలను రూపొందించవచ్చని అన్నారు. ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు, సాంకేతిక శిక్షణ కార్యక్రమాలు, పరిశోధన ఆధారిత పరిష్కారాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ ఎన్ఐటీ వరంగల్‌తో కుదిరిన ఈ ఒప్పందం నగర అభివృద్ధికి సాంకేతికంగా మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. నగరంలో ఎదురయ్యే పట్టణ సమస్యలకు శాస్త్రీయ, సాంకేతిక పరిష్కారాలను అన్వేషించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందన్నారు. మున్సిపల్ ఇంజినీర్లు, అధికారులు, సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పనితీరును మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. ఎన్ఐటీ నిపుణుల సలహాలు, పరిశోధన ఫలితాలను అభివృద్ధి కార్యక్రమాల్లో వినియోగించుకొని, పనుల నాణ్యతను పెంచుతూ పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జీడబ్ల్యూఎంసీ పరిపాలనా అనుభవం, ఎన్ఐటీ వరంగల్ సాంకేతిక నైపుణ్యం కలిసివచ్చే ఈ భాగస్వామ్యం నగర మౌలిక సదుపాయాల బలోపేతం, ఉద్యోగుల సామర్థ్య పెంపు, సమర్థవంతమైన పట్టణ నిర్వహణకు దోహదపడనుంది.

ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్ సీఎంహెచ్ డాక్టర్ రాజారెడ్డి ఎగ్జామినర్ ఆఫ్ అకౌంటెంట్ జనార్దన్, అకౌంట్స్ ఆఫీసర్ శివ లింగం అన్ని విభాగాల అధికారులు ఎన్ఐటీ వరంగల్ విభాగాధిపతులు, డీన్లు, సీనియర్ విద్యా, పరిపాలనా అధికారులు, జీడబ్ల్యూఎంసీ వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ప్రశస్త్ 2.0 స్క్రీనింగ్ వేగవంతం చేయాలి

అక్షరశక్తి,దుగ్గొండి: ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం దుగ్గొండి మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశస్త 2.0 కార్యక్రమంపై బుధవారం మధ్యాహ్నం దుగ్గొండి హైస్కూల్లో మండల విద్యాధికారి ఎస్. వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశస్త్ 2.0 స్క్రీనింగ్ ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించుటకు చేపట్టిన కార్యక్రమం కావున ప్రతి ప్రభుత్వ పాఠశాల, ప్రవేట్ యజమాన్యాల్లో తప్పకుండా సమయానుకూలంగా ఈ స్క్రీనింగ్ చేసి మండలాన్ని మొదటి స్థానంలో నిలపవలసిందిగా కోరనైనది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెడ్మాస్టర్లు టీచర్స్,ప్రైవేట్ యజమాన్యం మరియు ఈ కార్యక్రమానికి RPs శ్రీనివాస్,రవి, సంజీవ్ కుమార్ లు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో నవంబర్ 1న

రైతు గర్జన

పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ విప్ బాల్క సుమన్

అక్షరశక్తి, అదిలాబాద్ : రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను పక్కదారి పట్టించేందుకు తమ్మడిహెట్టి ప్రాజెక్టును తెర మీదికి తీసుకువచ్చి మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని మాజీ విప్ బాల్క సుమన్ అన్నారు. ఆదిలాబాద్‌లో నవంబర్ 1న నిర్వహించే రైతు గర్జన పోస్టర్లను మాజీ మంత్రి జోగు రామన్న, బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరువు ఏర్పడడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కారణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల నుంచి నీటిని ఎత్తిపోయాక గోదావరి, కృష్ణ నీటిని ప్రభుత్వం కిందికి వదిలిందని పేర్కొన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం నమోదైన అక్కడ కరువు పరిస్థితులు లేవన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శిష్యుడైన రేవంత్ రెడ్డి ఆ రాష్ట్రానికి నీటిని అందించడంలో సహాయపడినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థత కారణంగా కృష్ణాజలాలను ఆంధ్రప్రదేశ్ వినియోగించుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడడానికి కాంగ్రెస్ కారణమైతే బీజేపీ సైతం సహకరిస్తుందని చెప్పారు. రైతు గర్జనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని రైతులు ఎక్కువ సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు.



అర్నబ్ తుపాను బీభత్సం

కోస్తా తీరం అతలాకుతలం



అక్షరశక్తి, డెస్క్ : ఈ ఉదయం తీరం దాటిన అర్నబ్ తుపాను బీభత్సం సృష్టిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోస్తా తీరాన్ని అతలాకుతలం చేస్తున్నది. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం సమీపంలో తీరం దాటిన ఈ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. భారీ నుంచి అతిభారీ వర్షాలు, ప్రచండ గాలులతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపుతున్నది.

లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులన్నీ నదులను తలపిస్తున్నాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తుపాను కారణంగా ఉత్తరాంధ్ర జిల్లాలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. విజయనగరం జిల్లా గరివిడిలో రాష్ట్రంలోనే అత్యధికంగా 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అనకాపల్లి, శృంగవరపుకోట, వేపాడ, చీపురుపల్లిలో 25 సెంటీమీటర్లు, భీమునిపట్నం, ఎలమంచిలి, మెంటాడలో 24 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. విశాఖపట్నం, విజయనగరం పట్టణంలో 2122 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విజయనగరం జిల్లాలో సువర్ణముఖి, గోస్తనీ, చంపావతి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాలు నీట మునిగాయి. సాలూరు బస్టాండ్ పూర్తిగా నీటిలో చిక్కుకుంది. బలమైన ఈదురుగాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

నర్సాపురం వద్ద తుపాను తీరం దాటే సమయంలో పెనుగాలులు వీయడంతో అనేక ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆచంట, పెనుగొండ మండలాల్లో పలు ఇళ్లపై చెట్లు కూలాయి. దాంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోనసీమ, కాకినాడ, అల్లూరి జిల్లాల్లోనూ పలు రహదారులు జలమయమయ్యాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నీట మునగడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. భూపతిపాలెం, వట్టిగెడ్డ వంటి జలాశయాలు నిండుకుండలా మారాయి.

కృష్ణా, గుంటూరు జిల్లాలను సైతం భారీ వర్షాలు ముంచెత్తాయి. గుంటూరు నగరంలోని గుజ్జనగుండ్లకొరిటిపాడు రహదారి మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని బీఆర్ స్టేడియం చెరువును తలపిస్తున్నది. ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం, పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ నీటిలో చిక్కుకున్నాయి. బాపట్లలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వేమూరు నియోజకవర్గంలో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి.

కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంతో సహా పలు లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాగాయలంక వద్ద కృష్ణా నదిలో అలల ఉద్ధృతి పెరిగింది. తుపాను పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్రలో రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైన నేపథ్యంలో అధికార యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరిస్థితి చక్కబడే వరకు సహాయక చర్యలను కొనసాగించాలని స్పష్టంచేశారు. విరిగిన చెట్లను తొలగించడం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం వంటి పనులను అధికారులు ముమ్మరం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శిబిరం

- కాజీపేటలో 40 ఫిర్యాదుల స్వీకరణ..
- పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం



అక్షరశక్తి, కాజీపేట: రైల్వే ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ పర్సనల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ఫిర్యాదుల పరిష్కార శిబిరం నిర్వహించారు. ఎస్.సి. రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆనంద్ కట్ట ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి సుమారు 40 ఫిర్యాదులను స్వీకరించారు. సర్వీస్ రికార్డులు, ఉమిద్ రిజిస్ట్రేషన్, సీనియారిటీ జాబితా, హెచ్ఆర్ఎంఎస్ సమస్యలు, పెన్షన్, వేతనాలు, అలవెన్సులు, రెగ్యులర్ పదోన్నతులు, బదిలీలు, ఎంఏసీపీఎస్ కింద ఆర్థిక ఉన్నతీకరణకు సంబంధించిన సమస్యలపై ఉద్యోగులు తమ వినతులను అధికారులకు అందజేశారు. ఉద్యోగుల గుర్తింపు కార్డులు, ఉమిద్ కార్డులకు సంబంధించిన సమస్యలను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. విధానపరమైన సమస్యలను సికింద్రాబాద్ రైల్వే ప్రధాన కార్యాలయంలో పరిష్కరించేలా ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ స్టాఫ్ అండ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సి.వి.వి. రెడ్డి, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు ధర్మేంద్ర, పద్మారావు, సీనియర్ క్లర్క్ వికాస్‌కుమార్, చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్లు, ఆఫీస్ సూపరింటెండెంట్లు యశ్‌పాల్ సింగ్, డి. సత్యనారాయణ, వి. కృష్ణ, పి. సురేష్‌బాబు, జామున రాణి, కె. లక్ష్మణరావు పాల్గొన్నారు. ఎస్.సి. రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ కార్యదర్శి దేవులపల్లి రాఘవేందర్, సంయుక్త కార్యదర్శి మెరుగు రాజయ్య, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, సభ్యులు పి. ప్రవీణ్, రవికిరణ్, సమద్ పాషా, సారంగపాణి, హరి, నాగరాజు, అనిల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.

అక్షరశక్తి
Evening Daily
6
బుధవారం, 28 అక్టోబర్ 2026
Telugu Trending News



అన్ని రంగాల మాదిరిగా విద్యుత్ సేవల్లోనూ ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్, ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మెరుగైన సేవలు అందిస్తున్నామని, ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ సిబ్బంది విద్యుత్ సేవల కోసం క్షేత్ర స్థాయిలో నిరంతర శ్రమిస్తున్నారు అని అన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఎల్ నినో వల్ల భూగర్భ జలాలు తగ్గినప్పటికీ, పంటల మార్పిడి విధానం అమలు చేసి భారం పడకుండా ప్రభుత్వం అనేక ప్రణాళికలు రచిస్తున్నదని అన్నారు. విద్యుత్ డిమాండు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్ సరఫరాలోని సవాళ్లు' అనే అంశంపై డిజిటల్ మీడియా యూనియన్ ప్రతినిధులతో (టీడీఎంయూ) ప చిట్‌చాట్‌లో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అనేక విషయాలు వెల్లడించారు. - అక్షరశక్తి,ప్రధాన ప్రతినిధి

విద్యుత్ సేవల్లోనూ సాంకేతిక వినియోగం

పంపిణీ వ్యవస్థలో మనకు జాతీయ స్థాయి గుర్తింపు

- పంపిణీ వ్యవస్థలో మనకు జాతీయ స్థాయి గుర్తింపు
- విపత్తులను ఎదుర్కోవడం విద్యుత్ శాఖకు కొత్తేమీ కాదు
- ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు
- లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల సామర్థ్యం పెంపు
- రైతులకు అదనపు విద్యుత్
- ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడికి ప్రత్యేక ఏర్పాట్లు
- మూడవ డిస్కంతో సబ్సిడి సేవలు



డిమాండ్ అనుగుణంగా సప్లై

ఎల్ నినో వంటి అనేక విపత్తులు విద్యుత్ డిమాండ్ అసాధారణంగా పెరుగుతున్నప్పటికీ, దాన్ని ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సన్నద్ధమై ఉన్నామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు, రైతులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించేందుకు ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని, విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు వినియోగదారుల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల సామర్థ్యం పెంచడం, వ్యవసాయ అవసరాలకు అదనపు విద్యుత్ సరఫరా, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించే ఏర్పాట్లు చేశామని వివరించారు. విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తూ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

అసాధారణంగా పెరిగిన విద్యుత్ డిమాండ్

ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, ఉక్కపోత, వర్షా భావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని వరుణ్‌రెడ్డి తెలిపారు. గృహ, వాణిజ్య రంగాల్లో ఏసీలు, కూలర్ల వినియోగం పెరగడంతోపాటు భూగర్భ జలాలు తగ్గడంతో వ్యవసాయ పంపుసెట్ల వినియోగం అధికమైందన్నారు. గోదావరి, కృష్ణా బేసిన్ల నుంచి నీటిని ఎత్తిపోసే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణ కూడా విద్యుత్ డిమాండ్‌పై ప్రభావం చూపుతోందని వివరించారు. సాధారణంగా ఏటా విద్యుత్ డిమాండ్ 7 నుంచి 10 శాతం పెరుగుతుందని, ఈసారి మాత్రం అసాధారణ పెరుగుదల నమోదవుతోందని చెప్పారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో గత ఏడాది అక్టోబరులో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 3,762 మెగావాట్లుగా ఉండగా, ఈ ఏడాది అదే నెలలో 6,700 మెగావాట్లకు చేరిందని తెలిపారు. గత నెలలో దాదాపు 7,000 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైందన్నారు. గత ఏడాదితో పోలిస్తే అక్టోబరు నెలలో గరిష్ఠ డిమాండ్ సుమారు 67 శాతం పెరిగిందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది మార్చిలో 18,548 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదవగా, అక్టోబరులోనే 20,018 మెగావాట్ల రికార్డు డిమాండ్ నమోదైందని చెప్పారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

4,500 ట్రాన్స్‌ఫార్మర్లతో సామర్థ్యం పెంపు

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దాదాపు 4,500 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు సీఎండీ తెలిపారు. పట్టణాలు, మున్సిపాలిటీలు, గ్రామాల్లోని సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు కొత్త 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశామని వివరించారు. వచ్చే ఫిబ్రవరి నుంచి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో అక్టోబరు, నవంబరు నుంచే తదుపరి దశ పనులు చేపట్టామని తెలిపారు. ఎక్కడెక్కడ విద్యుత్ లోడ్ పెరిగే అవకాశముందో ముందుగానే అంచనా వేసి ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, కొత్త లైన్ల ఏర్పాటు, అవసరమైన చోట భూగర్భ విద్యుత్ లైన్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని, వాటి సరఫరా ప్రారంభమైందని వివరించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సరఫరా కూడా కొనసాగుతోందని, లైన్ల పనులకు టెండర్లు ఖరారు చేశామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల పనులను డిసెంబరు చివరి నాటికి లేదా జనవరి మధ్యలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

వ్యవసాయ విద్యుత్ డిమాండ్‌పై ప్రత్యేక దృష్టి

వ్యవసాయ రంగంలోనూ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని వరుణ్‌రెడ్డి తెలిపారు. కొన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో గత ఏడాదితో పోలిస్తే డిమాండ్ 70 నుంచి 80 శాతం వరకు పెరిగిందని, మరికొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 50 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి ఏప్రిల్, మే, జూన్ నెలల్లోనే పొలాల్లో విద్యుత్ లైన్ల ఏర్పాటు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు వంటి పనులు చేపట్టామని తెలిపారు. ముందస్తు ఏర్పాట్ల వల్ల పెరిగిన డిమాండ్‌ను విద్యుత్ వ్యవస్థ తట్టుకోగలుగుతోందన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్ అందించేందుకు అన్ని జిల్లాల్లో మూడు నెలలకు సరిపడా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నిల్వలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నప్పుడు వెంటనే స్పందించేందుకు అదనంగా దాదాపు 40 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లి దెబ్బతిన్నదాన్ని మార్చి, పాడైన దాన్ని తిరిగి తీసుకొస్తున్నామని, సాధ్యమైనంత వరకు 24 గంటల్లోపే మార్పిడి పూర్తి చేస్తున్నామని వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ పడకుండా చర్యలు

ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యానికి మించి మోటార్లు ఏర్పాటు చేయడం కూడా వైఫల్యాలకు కారణమవుతోందని వరుణ్‌రెడ్డి తెలిపారు. చెరువులు, కాలువల నుంచి నీటిని తోడేందుకు అదనపు మోటార్లు ఏర్పాటు చేయడం, బోరుబావులకు మరిన్ని మోటార్లు అమర్చడం, పాత బావులను తిరిగి వినియోగంలోకి తీసుకురావడం వల్ల విద్యుత్ లోడ్ పెరుగుతోందన్నారు. అలాంటి ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నామని చెప్పారు. తక్కువ వోల్టేజీ సమస్యలు ఎదురైనప్పుడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ట్యాప్స్ సర్దుబాటు చేయడం, కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేయడం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

మూడవ డిస్కంతో సబ్సిడి సేవలు

చాలా మందికి మూడవ డిస్కంపై అనేక అపోహలు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే రాయితీ పథకాలు, వాటి అమలు కోసం ఈ డిస్కం పనిచేస్తుంది. దీని వల్ల సాధారణ గృహ వినియోగం, సబ్సిడి వంటి అన్ని రకాల సేవలు నిరంతరాయంగా కొనసాగడానికి అవకాశం ఉంటుంది.

వరి పంటలకు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాయని సీఎండీ తెలిపారు. వచ్చే 15, 30, 45, 60 రోజుల్లో పంట కోతకు వచ్చే ప్రాంతాలను గుర్తించి నవంబరు చివరి వరకు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. పంట కోతకు మరో 15 నుంచి 20 రోజుల సమయం ఉన్న ప్రాంతాల్లో వరికి నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని గుర్తించి, ఆయా మండలాల్లో రాత్రి వేళల్లో అదనపు విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. రాత్రి 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ఒక విడత, ఒంటి గంట నుంచి

ఆరుతడి పంటల సాగుపై అవగాహన

నీటి వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు పంటల ఎంపికపై కూడా ఆలోచించాలని సీఎండీ సూచించారు. వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలతోపాటు, సాధ్యమైన చోట ఆరుతడి పంటలను ఎక్కువగా సాగు చేయడం రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల భూగర్భ జలాలు మరింతగా అడుగంటకుండా కాపాడుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఎల్నినో ప్రభావంతో విద్యుత్ సరఫరా నిర్వహణలో సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, వాటిని అధిగమించేందుకు శాఖ అన్ని విధాలుగా సన్నద్ధమై ఉందని వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు, రైతుల్లో విద్యుత్ వినియోగం, నీటి పొదుపుపై అవగాహన కల్పించడంతోపాటు, క్షేత్రస్థాయిలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ముందస్తు ప్రణాళిక, మౌలిక సదుపాయాల బలోపేతం, ట్రాన్స్‌ఫార్మర్ల నిల్వలు, రైతులతో సమన్వయం ద్వారా పెరుగుతున్న డిమాండ్‌ను ఎదుర్కొని ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించేందుకు చర్యలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

రైతులకు అదనపు విద్యుత్ సరఫరా

తెల్లవారుజామున 4 గంటల వరకు మరో విడతగా అదనపు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతులతో చర్చించి, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అధికారులు ఉదయం ఆరు గంటలకంటే ముందే సబ్‌స్టేషన్లు, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులతో మాట్లాడుతున్నారని, తక్కువ వోల్టేజీ వంటి సమస్యలు తలెత్తితే ట్రాన్స్‌కో అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తున్నామని వివరించారు.

